క్లుప్తంగా

తల్లి పేరుతో మొక్కలు నాటండి



నవోదయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కొమ్మాది: తల్లికి వందనం పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చంద్రశేఖర్ కోరారు. శనివారం పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఒక యజ్ఞంలా చేయాలన్నారు.

ఉత్సాహంగా జూనియర్ జాతీయ చౌక్‌బాల్ పోటీలు



చౌక్‌బాల్ పోటీల్లో తలపడుతున్న ఆంధ్ర, ఒడిశా బాలికలు

తగరపువలస: ఆనందపురం మండలం పాలవలసలో శుక్రవారం ప్రారంభమైన 16వ జూనియర్ జాతీయ చౌక్‌బాల్ పోటీలు రెండో రోజైన శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఆదివారం ఈ పోటీలు ముగియనున్నాయి. 24 రాష్ట్రాలకు చెందిన సుమారు 800 మంది బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆనందపురం మండల చరిత్రలో ఇంత పెద్ద పోటీలు జరగడం ఇదే మొదటిసారి అని స్థానికులు అంటున్నారు. క్రీడాకారులకు పాలవలసలోనే ఒక ప్రైవేట్ పాఠశాలలో వసతి కల్పించగా కోచ్‌లు, రిఫరీలకు పెద్దిపాలెంలోని చెన్నా ఫంక్షన్ హాల్లో వసతి ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ పంచాయతీల నుంచి ప్రజలు ఈ క్రీడలను చూడటానికి తరలి వస్తున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో కేజీబీవీ విద్యార్థులకు శిక్షణ



బేకరీలో శిక్షణ పొందుతున్న కేజీబీవీ విద్యార్థులు

తగరపువలస: ఆనందపురం కేజీబీవీలో ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు దసరా ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా 10 రోజుల పాటు ఫుడ్ ప్రాసెసింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 21న ప్రారంభమైన ఈ కార్యక్రమం 30న ముగుస్తుంది. వృత్తి విద్య ఉపాధ్యాయిని బి.స్వరాజ్యం మండలంలోని వేములవలస కూడలిలోని బాలాజీ స్వీట్స్ అండ్ బేకరీలో విద్యార్థినులకు రొట్టె, కేకులు, పేస్ట్రీ, కుకీస్‌ను తయారు చేసే విధానంలో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో శనివారం సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ జోగ చంద్రశేఖర్, జీసీడీవో శ్రీదేవి, ప్రిన్సిపాల్ ఎస్.లావణ్య, స్కూల్ కమిటీ చైర్మన్ కోరుకొండ శివాజీ, వైస్ చైర్మన్ మంగా అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతిపై బదిలీ అయిన అధికారులకు సన్మానం



పదోన్నతినపై బదిలీ అయిన ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పదోన్నతిపై బదిలీ అయిన ఇద్దరు అధికారులను మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఇక్కడ ఎంపీడీవోగా చేసిన ఎం.విజయకుమార్‌కు ఏఎస్‌ఆర్ జిల్లా చింతూరు డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. అలాగే, డిప్యూటీ ఎంపీడీవోగా పని చేసిన మీనా కుమారి ఎంపీడీవోగా పదోన్నతిపై అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. వారిద్దరినీ శనివారం సన్మానించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వారిని దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో డి.నగేష్, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, భీమునిపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు, మండల పరిషత్ ఏవో జయ ఉమ, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో కె.రమేష్ నాయుడు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

తగరపువలస: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందంటూ వాసవ్య మహిళా మండలి శాంత్ సాంత్వన ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వై.గోపీచంద్ అన్నారు. ఆనందపురం మండలం చందకలో శారీరక, మానసిక ఆరోగ్యంపై శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. కమ్యూనిటీ మెంటల్ హెల్త్ కేర్ కార్యక్రమంలో భాగంగా సిబ్బంది నాటికలను ప్రదర్శించారు. స్థానికులు పాల్గొన్నారు.

మంగళకారిణి.. సౌభాగ్యప్రదాయిని

- లలితా త్రిపురసుందరిగా దుర్గాదేవి
- వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆరో రోజు దుర్గామాత లలితా త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. సౌభాగ్యదాయిని, ఐశ్వర్యప్రదాయిని అయిన లలితా మాతను మహిళలు, మాలధారులు భక్తితో కొలిచారు. కారుషెడ్ కూడలిలోని బబ్బేలమ్మ ఆలయంలో, చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం, చోడేశ్వర స్వామి ఆలయంలో, ఎండాడ దుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని విశేషంగా పుష్పాలతో అలంకరించి, పూజలు చేశారు. భీమిలి పాత బస్టాండ్ వద్ద నూకాంబిక ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. మండపాల వద్ద కుంకుమార్చనలు చేశారు. చిట్టివలస రైతుబజారు వద్ద మండపంలో అమ్మవారికి మహిళలు సారె సమర్పించారు.

– పీఎం పాలెం/తగరపువలస/మధురవాడ/భీమునిపట్నం/కొమ్మాది



ప్రత్యేక అలంకరణలో బైపాస్ రోడ్డులోని విజయదుర్గ ఆలయం



లలితా త్రిపుర సుందరిగా కారుషెడ్ బబ్బేలమ్మ



చిట్టివలస రైతుబజారు వద్ద మండపంలో అమ్మవారికి సారె



నూకాంబిక ఆటోడ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో కొలువుదీర్చిన అమ్మవారు



ఎండాడ దుర్గాదేవి ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా..



లలితా త్రిపుర సుందరిగా దుర్గాలమ్మ



చిట్టివలస రైతుబజారు వద్ద మండపంలో అమ్మవారికి సారె

జీవీఎంసీకి రూ.17లక్షల ఆదాయం

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్‌కు రూ.17,27,769 ఆదాయం సమకూరింది. 6వ వార్డులోని రెండు కార్పొరేట్ సంస్థల నుంచి ట్యాక్స్ నిమిత్తం ఈ ఆదాయం వచ్చింది. ఈ చెక్కులను ఆర్‌ఐ సుభాన్ ఆధ్వర్యంలో సచివాలయ అడ్మిన్ ఈశ్వర్‌రెడ్డి తదితరులు రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్ నాగేంద్రకుమార్‌కు శనివారం సాయంత్రం ఆయన ఛాంబర్‌లో అందజేశారు. నాగేంద్రకుమార్ మాట్లాడుతూ నగర పౌరులు, వ్యాపార, కార్పొరేట్ సంస్థలకు చెందిన వారు పన్నులు సకాలంలో చెల్లించి, జీవీఎంసీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.



ఏసీ నాగేంద్రకుమార్‌కు చెక్కులు అందజేస్తున్న ఆర్‌ఐ సుభాన్ తదితరులు

కార్యకర్తలతో చిన్న శ్రీను మాటామంతి

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు శనివారం ఆనందపురం మండలంలో పర్యటించి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని గండిగుండం పంచాయతీలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట్రెడ్డి శ్రీనివాస్ ఇంటికి వెళ్లారు. అక్కడ చుట్టుపక్కల పంచాయతీల నాయకులతో సమావేశం అయ్యారు. ఆనందపురం మండలం వేములవలసలో నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద నాయకులతో కాసేపు ముచ్చటించారు. పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంగి శ్రీను, పల్ల రమణ, జిన్నాల వెంకటరమణ, గీతల దేవుడు, చందక సూరిబాబు, రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వేములవలస నాయకులతో మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

డిగ్రీ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు ఆఖరు తేదీ 29

తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు ఈ నెల 29 ఆఖరు తేదీ అని ప్రిన్సిపాల్ శ్రీవాణి తెలిపారు. గతంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాళ్లు నేరుగా వెబ్ ఆప్షన్లను ప్రభుత్వ డిగ్రీ కళాశాల తగరపువలసలో చూసుకోవాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేయించుకోలేని వాళ్లు కళాశాలకు వస్తే తామే రిజిస్ట్రేషన్ చేయిస్తామని తెలిపారు. తమ కళాశాలలో బీఏ హిస్టరీ ఆనర్స్, బీఎస్సీ మ్యాథ్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్ ఆనర్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ గ్రూపులకు ప్రవేశాలు జరుగుతున్నాయని తెలియజేశారు.

సీఐటీయూ నాయకులపై క్రిమినల్ కేసు

అధికారులను విధులకు వెళ్లకుండా అడ్డుకోవడంపై చర్యలకు సిద్ధం

భీమునిపట్నం: భీమిలిలోని జోనల్ కార్యాలయం వద్ద తమను విధులకు వెళ్లకుండా అడ్డుకున్న సీఐటీయూ నాయకులపై క్రిమినల్ కేసు పెట్టనున్నట్లు జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు శనివారం విలేకరులకు తెలిపారు. తగరపువలస ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్ద బడ్డీలు తొలగింపు అన్యాయమని శుక్రవారం తమతో పాటు ఇతర అధికారులు, సిబ్బందిని విధులకు హాజరుకాకుండా అడ్డుకున్నారన్నారు. ఇది చాలా పెద్ద తప్పని, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలే తప్ప ఇలా అడ్డుకోవడం సరికాదన్నారు. పైగా తాము నిబంధనలకు విరుద్ధంగా బడ్డీలను తొలగించామని ఆరోపించారని, అందులో ఏమాత్రం నిజం లేదన్నారు. ఆ స్థలాన్ని నేషనల్ హైవే అథారిటీ వారు ఎప్పుడో కొనుగోలు చేశారని, ఆ స్థలం వారిదని తెలిపారు. ఇందులో ఎవరికీ హక్కు లేదని, కానీ తమపై వీరు తప్పుడు, నిరాధారమైన ఆరోపణలు చేయడంతో పాటు విధులకు వెళ్లకుండా అడ్డుకుని తమ సమయాన్ని వృథా చేశారన్నారు. తప్పుడు ఆరోపణలతో పాటు విధులకు అడ్డుకోవడంపై కేసు పెడుతున్నామని తెలియజేశారు.

నేటి నుంచి శిల్పారామంలో దసరా సంబరాలు

పీఎం పాలెం: ప్రముఖ పర్యాటక కేంద్రం శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నుంచి దసరా సంబరాలు ప్రారంభమవుతాయని స్థానిక పరిపాలనాధికారి రమేష్ రెడ్డి తెలిపారు. నవంబర్ రెండో తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు తదితర వినోద కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు

తొలగింపును అడ్డుకున్న టీడీపీ నేత

మధురవాడ: ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు పనులను టీడీపీ నేత అడ్డుకున్నారు. శనివారం జాతీయ రహదారి–నగరంపాలెం రోడ్డు జంక్షన్ మలుపు వద్ద దుకాణాలు తొలగించి, స్థలం స్వాధీనానికి జీవీఎంసీ డీసీపీ హరిదాసు, ఏసీపీ షబ్నాం శాస్త్రి ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో వచ్చారు. ఇక్కడ దుకాణాలు తొలగించేందుకు అధికారులు ప్రయత్నించగా.. టీడీపీ నాయకుడు, ఏపీ నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి సూర్యప్రకాశరావు, బైపిల్లి సతీష్ ఉమ్మడి కుటుంబసభ్యులు పనులను అడ్డుకున్నారు. తమకు పరిహారంపై గ్యారంటీ ఇవ్వకపోతే పనులు సాగనివ్వమని భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బైపిల్లి కుటుంబసభ్యులు అయితే, కోర్టు కేసు పెండింగ్‌లో ఉండగా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. పీఎంపాలెం ఎస్‌ఐ భాస్కరరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. దీనిపై డీసీపీ హరిదాసు మాట్లాడుతూ పరిహారంలో ఎటువంటి పెండింగ్ లేదని, ప్రభుత్వ స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగిస్తుంటే సదరు వ్యక్తులు అడ్డుకుంటున్నారని తెలిపారు. కోర్టు వివాదం కూడా లేదని, రోడ్డు అవసరాల నిమిత్తమే ప్రభుత్వం స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్నామని చెప్పారు. అయితే పోలీసులు జోక్యంతో, డాక్యుమెంట్లు ఇతర అంశాలు మరోసారి పరిశీలించాలని బాధితులు కోరడంతో జీవీఎంసీ అధికారులు వెనుదిరిగారు.



జీవీఎంసీ అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న టీడీపీ నాయకుడు నాగోతి సూర్యప్రకాశరావు

గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు

పద్మనాభం: వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన పద్మనాభం మండల సర్వ సభ్య సమావేశంలో ఆయన శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల బస్సులకు ప్రతీ ఏడాది ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత పాఠశాల యాజమాన్యాలపై విద్యాశాఖాధికారుల కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు మాట్లాడుతూ రెడ్డిపల్లి పంచాయతీ భద్రయ్యపేటలో ఎక్కువ మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులవడానికి కలుషిత తాగునీరు కారణమా, కాదా అని ప్రశ్నించారు. దీనికి రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లీలా ప్రసాద్ సమాధానమిస్తూ భద్రయ్యపేటలో నీరు కలుషితం కాలేదన్నారు. రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు మాట్లాడుతూ రేవిడి పీహెచ్‌సీలో ఎనిమిదేళ్ల నుంచి ట్యూబెక్టమీ ఆపరేషన్లు జరగడం లేదని తెలిపారు. శేరిఖండం సర్పంచ్ పల్లంటి చిన్నారావు గంధవరం ఎంపీటీసీ సభ్యుడు బీవీఎస్‌పీ రాజు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీవో డి.నగేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ రాంబాబు

సచివాలయ సిబ్బందికి శిక్షణ

తగరపువలస: ఆనందపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందికి పీ4 సర్వేపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో బి.సత్యనారాయణ మాట్లాడుతూ సర్వేలో తీసుకోవలసిన మెలకువలు, బంగారు కుటుంబాల అవసరాలు గుర్తించడం, మార్గదర్శులతో అనుసంధానం తదితర అంశాలను వివరించారు. ప్రతి గ్రామంలో పేదరిక నిర్మూలనకు పని చేయాలన్నారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ సభ్యులు కె.ఉషాపద్మిని, పి.దివ్యజ్యోతి, ఎన్.నవ్య, జి.ప్రజ్వల, కె.ఉషారాణి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

తగరపువలస: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. వారిలో యూత్ విభాగం అధ్యక్షుడిగా పాల రమణ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా డబ్బీరు ప్రశాంతి, రైతు విభాగం అధ్యక్షుడిగా సుంకర బంగారప్పుడు, బీసీ సెల్‌కు భీమవరపు అప్పలరాజు, ఎస్సీ సెల్‌కు ఈర్ని ఈశ్వరరావు, ఎస్టీ సెల్‌కు పి.అప్పన్న, మైనారిటీ సెల్‌కు ఎం.ముస్తఫా, క్రిస్టియన్ మైనారిటీ సెల్‌కు ఎ.సత్యనారాయణమూర్తి(సతీష్), విద్యార్థి విభాగానికి రౌతు శ్రీను, పంచాయతీ విభాగానికి శిరిగిడి ఆదిబాబు, మున్సిపల్ విభాగానికి టి.విజయశంకర్, ఆర్టీఐ విభాగానికి గుండాసి మధునాయుడులను నియమించారు. అలాగే వలంటీర్ విభాగానికి జీరు వెంకటరెడ్డి, గ్రీవెన్స్ సెల్‌కు షిణగం రాంబాబు, వాణిజ్య విభాగానికి మేడిశెట్టి రాంజీ, వైఎస్సార్‌టీయూసీకి కొరాయి సన్యాసిరావు, అంగన్‌వాడీ విభాగానికి చిరుతోటి అనూష, లీగల్ సెల్‌కు కంఠిమహంతి చంద్రమౌళి, కల్చరల్ విభాగానికి వేముల ఈశ్వర్ రెడ్డి, ఐటీ విభాగానికి టి.అశోక్, దివ్యాంగుల విభాగానికి కొండపల్లి శ్రీనివాసరావు, బూత్ కమిటీల విభాగానికి చిల్ల వంశీకృష్ణారెడ్డి, పబ్లిసిటీ విభాగానికి డి.దిలీప్‌రెడ్డి, కళాకారుల విభాగానికి దూడ అచ్యుతరావు అధ్యక్షులుగా నియమితులయ్యారు.